క్లుప్తంగా

రిజర్వేషన్ల కల్పనపై హర్షం

ఖానాపూర్: పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో ప్రభుత్వం దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షనీయమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు తొడసం శంభు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పోరాటంతోనే ప్రభుత్వం దిగివచ్చి సానుకూలంగా స్పందించిందన్నారు. 33 జీవో ప్రకారం లబ్ధిదారుల ఎంపికలో రిజర్వేషన్లు అమలయ్యేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

5న ప్రజావేదిక

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 5న శనివారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయిరాం ఓ ప్రకటనలో తెలి పా రు. నవంబర్ 1, 2020 నుంచి మార్చి 31, 2023 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక ఉంటుందన్నారు. అధికారులు హాజరు కావాలని కోరారు.

'సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి'



మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: సీఎం కేసీఆర్ కార్మిక పక్షపాతి అని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించడంపై బుధవారం భైంసా డిపోలో ఆర్టీసీ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగు నింపిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

'ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి'

ఖానాపూర్: పట్టణంలో కనీస సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి శివాజీగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఖానాపూర్‌లో అనేక పాఠశాలల్లో నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

చోరీల నివారణకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హన్మాండ్లు

కుంటాల: చోరీల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సూర్యాపూర్ గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి అడిగితే బ్యాంకు వివరాలు, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. సర్పంచ్ సునీత, అడెల్లు, ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అర్లి(కే) క్రాస్‌రోడ్ 61 జాతీయ రహదారిపై ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.

నట్టల నివారణ మందు పంపిణీ

ముధోల్: మండలకేంద్రంతోపాటు మండలంలోని విఠోలి, తరోడా గ్రామాల్లో బుధవా రం పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆపదలో ఫిర్యాదు చేయండి

లక్ష్మణచాంద: ఇబ్బందులకు గురైతే ధైర్యంగా 100కు ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి ఓటీపీలు, బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఎస్‌వో నవిత, పోలీసులు పాల్గొన్నారు.

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి వినతి



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఖానాపూర్: తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను బుధవారం ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సంఘం నాయకులు హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే తమను రెగ్యులర్ చేసి కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఘాట్‌రోడ్డుపై నిర్లక్ష్యం..

- ఏటా వర్షాకాలంలో కోతకు గురవుతున్న మాడేగాం ఘాట్ రోడ్డు
- కదిలి పాపహరేశ్వర ఆలయానికి వెళ్లే మార్గంలో ఐదు ప్రమాదకర మలుపులు
- శ్రావణమాసంలో పెరగనున్న భక్తుల రద్దీ
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు



కోతకు గురై ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు



వర్షానికి రోడ్డు దెబ్బతినడంతో వాహనదారుడి అవస్థలు

దిలావర్‌పూర్: చుట్టూ పచ్చదనం.. కొండల నడుమ కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. దిలావర్‌పూర్ బస్టాండ్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో మాడేగాం పంచాయతీ పరిధిలో కదిలి అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ మాతాన్నపూర్ణేశ్వర పాపహరేశ్వరాలయానికి ఏటా శ్రావణమాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. నిర్మల్ నుంచి భైంసా వెళ్లే రోడ్డు మార్గంలో 11 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత కుడివైపు తిరిగి మరో ఐదు కిలోమీటర్లు ప్రయాణిస్తే ఈ ఆలయానికి చేరుకోవచ్చు.

మాడేగాం ఘాట్‌రోడ్డుకు ఐదు మలుపులు..

మాడేగాం ఘాట్‌రోడ్డు దాటిన తర్వాత కదిలి అటవీ ప్రాంతంలో ఈ ఆలయం ఉంది. దిలావర్‌పూర్ నుంచి అరకిలోమీటర్ దాటిన తర్వాత ఒకటిన్నర కిలోమీటర్ల మేర ఉన్న ఈ ఘాట్‌రోడ్డుకు ఐదు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో పలువురు వాహనదారులు అదుపు తప్పి కింద పడిన ఘటనలు ఉన్నాయి.

మాడేగాం, కదిలి, కుస్లి గ్రామాలకు ఇదే ప్రధాన రోడ్డు..

దిలావర్‌పూర్ నుంచి ఉన్న ఈ రోడ్డు గుండానే మండలంలోని మాడేగాం, కదిలి, నర్సాపూర్(జి) గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏటా వర్షాకాలంలో వరదలకు ఈ రోడ్డు ధ్వంసమవుతూనే ఉంటోంది. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. మాడేగాం పంచాయతీ నుంచి ఘాట్ రోడ్డు ధ్వంసమైతే తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నా.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. దీంతో ఎప్పుడేం జరుగుతోందనని ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు.

శ్రావణమాసంలో తరలిరానున్న భక్తులు..

ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే శ్రావణమాసంలో భక్తులు పెద్దఎత్తున ఈ ఆలయానికి తరలివస్తారు. కానీ కదిలి నుంచి ఆలయానికి చేరే ఘాట్ రోడ్డు రెండు కిలోమీటర్ల మేర అధ్వానంగా మారింది. ఎంతో ప్రాశస్త్యం కల్గిన ఈ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచే కాక నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో ఈ ప్రమాదకర ఘాట్ రోడ్డు గుండానే ఆలయానికి చేరుకుంటారు. రోజుకు ఐదు వేల మంది భక్తులు వస్తుంటారు. ఇలాంటి తరుణంలో అధికారులు స్పందించి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



దిలావర్‌పూర్ నుంచి మాడేగాం, కదిలి గ్రామాలకు వెళ్లే ఘాట్ రోడ్డు వర్షాలకు దెబ్బ తింటోంది. నిత్యం ఈ మార్గంలోనే ప్రయాణం సాగిస్తుంటాం. మలుపులు ప్రమాదకరంగా మారాయి. అధికారులు ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. – కదం నవీన్, దిలావర్‌పూర్

ఆటో నడపాలంటే భయమవుతోంది



మాడేగాం ఘాట్‌రోడ్డుపై ఆటో నడపాలంటే భయమైతంది. బస్సు లేకపోవడంతో కదిలి, మాడేగాం గ్రామాల ప్రజలను దిలావర్‌పూర్ బస్టాండ్‌కు.. అక్కడి నుంచి భక్తులను కదిలి పాపహరేశ్వరాలయానికి ఆటోలో తీసుకెళ్తుంటా. మాడేగాం ఘాట్‌రోడ్డు సరిగా లేదు. మలుపుల వద్ద ప్రమాదం పొంచి ఉంది.

– దానూర్ పోషన్న, ఆటో డ్రైవర్, కదిలి

ప్రతిపాదనలు పంపించాం..

దిలావర్‌పూర్ నుంచి మాడేగాం, కదిలి గ్రామాలకు వెళ్లే ఘాట్ రోడ్డు భారీ వర్షాలకు దెబ్బతిన్న మాట వాస్తవమే. ఈ రోడ్డును పరిశీలించాం. వరద ఉధృతికి బండరాళ్లు చేరడంతో రోడ్డు మలుపులు ధ్వంసమయ్యాయి. వీటి మరమ్మతులకు రూ.ఐదు లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే మరమ్మతులు చేపట్టి.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, దిలావర్‌పూర్

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఖానాపూర్: పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని గాంధీగర్ కాలనీవాసులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్‌ఎస్ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శనిగారపు శ్రావణ్, దివాకర్, ప్రసాద్, కారింగుల సుమన్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖానాపూర్/ముధోల్: అసెంబ్లీ సమావేశాల్లో పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వి.రాములు అన్నారు. ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 28వరోజుకు చేరింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, నాగరాజు, పోశెట్టి, వెంకటేశ్, రాజు, గజేందర్, ముత్యం, లక్ష్మి, సునీత ఉన్నారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ముధోల్‌లో పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూజర్ చార్జీలు చెల్లించాలి

ఖానాపూర్: మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, హ్యాండ్లింగ్ చార్జెస్–2016 ప్రకారం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగం, వ్యర్థాల సేకరణకు యూజర్ చార్జీలను ప్రతీ ఒక్కరూ చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నెలకు ఇండిపెండెంట్ గృహానికి రూ.20, అపార్ట్‌మెంట్ గృహానికి రూ.50, ప్రైవేట్ ఆస్పత్రికి రూ.100, పెట్రోల్ పంపునకు రూ.250, ఫంక్షన్ హాల్‌కు రూ.1000, టిఫిన్ సెంటర్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రూ.300, హోటల్‌కు రూ.500, చికెన్ సెంటర్లకు రూ.500 నుంచి వెయ్యివరకు చెల్లించాలని కోరారు.

తల్లిపాలతోనే చిన్నారులకు రక్ష

ఖానాపూర్: తల్లిపాలతోనే బిడ్డకు రోగనిరోధక శక్తి అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యానగర్–1, శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన తల్లిపాల వారోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలను పట్టించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పార్వతి, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్యంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మన్మద్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, లలిత, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



ఖానాపూర్: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నిర్మల



మామడ: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్యామల

కడెం: మండలంలోని మాసాయిపేట్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ రాముగౌడ్, అంగన్‌వాడీ టీచర్ గంగవ్వ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, సర్పంచ్‌లు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'పై ఉపాధ్యాయులకు శిక్షణ

మామడ: విద్యార్థులకు కృత్యాధార బోధన నిర్వహించాలని నోడల్ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తొలిమెట్టు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమికస్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఆసక్తి కలిగేలా కృత్యాలను వినియోగించి కనీస సామర్థ్యాలను సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. రిసోర్స్‌పర్సన్లు పవన్, శిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: కనీస సామర్థ్యాలు కలిగి ఉంటేనే తరగతి సామర్థ్యాలు సాధించగలుగుతామని మండల రిసోర్స్‌పర్సన్ గంగాప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మౌళిక భాషా గణిత సాధనలో భాగంగా ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కోర్సు డైరెక్టర్ మధుకర్‌రావు ప్రారంభించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం విషయాల్లో తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాల పాఠ్యాంశాలపై శిక్షణనిచ్చారు. 140 రోజులకు గాను బోధించే పాఠ్యప్రణాళికలతో కూడిన పుస్తకాలు అందజేశారు. లోకేశ్వరం క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్, ఎమ్మార్సీలు గంగాప్రసాద్, నవ్య ఉన్నారు.



లోకేశ్వరంలో మాట్లాడుతున్న గంగాప్రసాద్

ఖానాపూర్: మౌళిక భాష, గణిత సామర్థ్యాల సాధన కోసమే తొలిమెట్టు కార్యక్రమాన్ని విద్యాశాఖ చేపట్టిందని ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారి సాయికృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 40 మంది ఉపాధ్యాయులకు తొలిమెట్టుపై శిక్షణ నిర్వహించారు. హెచ్‌ఎం మమత, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు భాషా మౌళిక, గణిత సామర్థ్యాల సాధనపై శిక్షణనిచ్చారు. పాఠ్యపుస్తకాల రూపకల్పన, అభ్యాస దీపికలపై అవగాహన కల్పించారు. ఎంఈవో ముత్యం, నోడల్ అధికారి గజపెల్లి నర్సయ్య, రిసోర్స్‌పర్సన్లు ఎల్లన్న, ప్రవీణ్ తదితరులున్నారు.

ముధోల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం ముధోల్‌లోని రవీంద్ర పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎస్‌పై శిక్షణ నిర్వహించారు. ఎంఈవో మైసాజీ, కో ఆర్డినేటర్ మమతలు హాజరై పలు సూచనలు చేశారు.

సంక్షిప్త వార్తలు

రాగిజావ పంపిణీ

మామడ: మండలంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలకు బుధవారం రాగిజావ ప్యాకెట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులకు అందించారు. దీంతో రోజు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేయనున్నారు. సీఆర్పీ నారాయణ, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో భూమిపూజ

లక్ష్మణచాంద: పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసమే రాష్ట్ర ప్రభుత్వం మనఊరు–మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ అడ్వాల పద్మ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.39 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎంపీపీ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. పాఠశాలలో రెండు తరగతి గదులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనం హర్షణీయం

ఖానాపూర్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన సకల జనుల సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని మాజీ జెడ్పీటీసీ రామునాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజగంగన్న అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మోహిద్, అంకం రాజేందర్, ఆకుల వెంకాగౌడ్, పుప్పాల శంకర్, వాల్‌సింగ్, గొర్రె గంగాధర్ తదితరులు ఉన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని మొహళలో గ్రామాభివృద్ధి కమిటీ భవనం నిర్మించేందుకు జెడ్పీ నిధులు రూ.లక్ష మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ప్రొసీడింగ్‌ను సభ్యులకు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్ మద్దెల ఎల్లన్న, బండి ప్రశాంత్, ముత్తన్న, దండె రమేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా శంకర్

కడెం: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తరి శంకర్ నియమితులయ్యారు. బుధవారం మండలకేంద్రంలోని హరితరిసార్ట్స్‌లో కాంగ్రెస్ నాయకులు సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శ శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రఫీక్, భూమన్న, రమేశ్, బబ్లూ, బ్రహ్మచారి, రాజన్న తదితరులు ఉన్నారు..

దస్తురాబాద్ తహసీల్దార్‌గా జకీర్

దస్తురాబాద్: మండల తహసీల్దార్‌గా ఎండీ జకీర్ నియమితులైనట్లు బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పని చేసిన జి.లక్ష్మి బదిలీపై ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలానికి వెళ్లారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే తహసీల్దార్ ఇక్కడ నియమితులయ్యారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి

సోన్: మండలంలోని జెడ్పీఎస్‌ఎస్ సోన్, వెల్మల్ బొప్పారం, సెకండరీ పాఠశాలల్లో బుధవారం పీఆర్టీయూ కార్యదర్శి కమలాకర్ అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి వివి రమణరావు, సోన్ మండలాధ్యక్షుడు శంకర్, నిర్మల్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, కమలాకర్‌రావు, శ్రీధర్‌రెడ్డి తదితరులున్నారు.

కల్లూర్‌లో వైద్య పరీక్షలు

కుంటాల: మండలంలోని కల్లూర్ పంచా య తీ ఆవరణలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50మందిని పరీ క్షించి పలువురికి మందులు అందజేశారు. వైద్యురాలు అమృతయాణి, హెల్త్ అసిస్టెంట్ కిషన్ ప్రసాద్, ఏఎన్‌ఎం విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్, సూర్యాపూర్ గ్రామాల్లో బుధవారం ఈవీఎంల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. అర్హులందరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై హన్మాండ్లు, ఆర్‌ఐ అడెల్లు, ఏఎస్‌వో సాయన్న, సర్పంచ్‌లు సునీత, చంద్రకాంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పింగలి వెంకయ్యకు నివాళి

భైంసాటౌన్: విద్యార్థులు జాతీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని గాంధీ బాల సేవా సంఘం అధ్యక్షుడు పుండ్లిక్‌రావు అన్నారు. పట్టణంలోని శ్రీమేధ పాఠశాలలో బుధవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ప్రేమానంద్, శ్రీకాంత్ తదితరులున్నారు.

కుంటాలలో..

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో పింగళి వెంకయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దోనిగామ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన ముత్తన్న అనే యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి బుధవారం వడ్యాల్ వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, నరేశ్‌రెడ్డి, మోహన్, రాజేంద్రప్రసాద్, లింగాగౌడ్, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని పీచరకు చెందిన శివరాత్రి ఈదన్న పాటుకాటుకు గురై జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వడ్డెర సంఘం జిల్లా సంఘం ఈదన్నను పరామర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్, సాయిలు, శ్రీనివాస్, రవీందర్ ఉన్నారు.

ఉద్యమకారులకు ప్రాధాన్యం

ముధోల్: తెలంగాణ ఉద్యమకారులకు విద్యార్థి సంఘంలో ప్రాధాన్యం ఇస్తున్నామని వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధినేత కోదండరాం ఆదేశాల మేరకు తెలంగాణ పరిరక్షణకు టీజేఎస్ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరిన పల్లపు తులసిరాంను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు.

సన్మానం

కుంటాల: కుంటాల తహసీల్దార్ కలీం ని జామాబాద్ జిల్లాకు బదిలీ కాగా బుధవారం ఆయనను స్థానిక కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జారాంయాదవ్, హైమద్, మల్లేశ్, వైస్ ఎంపీపీ మౌనికనవీన్, డీటీ నరేష్‌గౌడ్, ఆర్‌ఐ అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

150 కుటుంబాలకు సరుకుల పంపిణీ

భైంసారూరల్: మండలంలోని సిరాల ప్రాజెక్టు వరదతో నష్టపోయిన 150 బాధిత కుటుంబాలకు బుధవారం రెవెన్యూ అధికారులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, రెండు లీటర్ల వంటనూనెతోపాటు పలు రకాల వస్తువులను అందించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సతీశ్, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, గంగాధర్ తదితరులు ఉన్నారు.



సరుకులు అందిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

నిర్మల్‌చైన్‌గేట్: సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందకుండా ఫిర్యాదు చేయాలని.. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకోచ్చని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. ఇటీవల పలువురు పోగొట్టుకున్న 15 ఫోన్లను సీఈఐఆర్ ద్వారా కనుగొని బుధవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా.. చోరీ అయినా బాధితులు సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ నాయక్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, ఐటీకోర్ విభాగం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు ఫోన్లు అందిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నష్టపరిహారం అందించి ఆదుకోవాలి

తానూరు: భారీవర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25వేల పరిహారమిచ్చి ఆదుకోవాలని టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ అన్నారు. బుధవారం మండలంలోని హిప్నెల్లిలో గండిపడిన చెరువుకట్టను పరిశీలించి మాట్లాడారు. అవినాశ్, అభిషేక్, మాధవ్‌రామ్‌పటేల్, ఖాజా గౌతం, దీపక్, లింగన్న, రాము ఉన్నారు.

తానూరు: మండలంలోని ఎల్విత్, వాడవన గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావ్ పర్యటించారు. వరద బాధితులను పరామర్శించి బ్రిడ్జికి ఇరువైపులా కొట్టుకుపోయిన పంటలను పరిశీలించారు. చక్రధర్ పటేల్, సురేశ్, సంతోశ్, అంబాజీ, శ్రీనివాస్, భూషణ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి):మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి(కె), మోతక్‌పల్లి గ్రామాల రైతులు సుద్దవాగు పరివాహక ప్రాంతంలో 300 ఎకరాల్లో పంటలు సాగు చేయగా ఇటీవలి వర్షాలకు కొట్టుకుపోయాయి. పత్తి, సోయా, మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో బుధవారం క్లస్టర్ ఏఈఓ రమ్య పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈసారైనా తమకు నష్టపరిహారం ఇవ్వాలని పలువురు రైతులు అధికారులను వేడుకున్నారు.

ఆంక్షల్లేని జీవనభృతి అమలు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ కార్మికులకు ఆంక్షల్లేకుండా జీవనభృతి అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. నిర్మల్‌రూరల్ మండలం వెంగ్వపేట్‌లో బుధవారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల సాధనకు ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మిక గర్జనను జయప్రదం చేయాలన్నారు. కనీస వేతన జీవో 41ని అమలు చేయాలన్నారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. కె లక్ష్మి, చిన్నయ్య, ఉత్తమ్, మురళి, రవి, జమున, లక్ష్మి, రుక్మ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీడీ కార్మికులు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

సోన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్, గాంధీనగర్‌లో బుధవారం పర్యటించి సీజనల్‌వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖలీల్ హైమద్, ఏపీవో మంజులారెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కరదీపిక ఆవిష్కరణ..

నిర్మల్‌చైన్‌గేట్: పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ఆయుష్ వైద్యాధికారి గంగాదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయుష్ ఆరోగ్య కరదీపిక ఆవిష్కరించారు. ప్రధానాచార్యులు నరేశ్, ఆచార్యులు పాల్గొన్నారు.